క్లుప్తంగా

నేడు కలిచేడుకు నేదురుమల్లి రాక


నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం : మండలంలోని కలిచేడుకు శనివారం వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి రానున్నట్లు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి నేదురుమల్లి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఇంటింటికీ వైద్య సేవలు


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ

పెళ్లకూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ సురేష్ బాబు తెలిపారు. శుక్రవారం తాళ్వాయిపాడు సచివాలయంలో ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు చేసి వ్యాధిగ్రస్తులకు అత్యుత్తమ చికిత్స అందించనున్నట్లు వెల్లడించారు. అనంతరం గ్రామంలోని పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. విద్యార్థులతో స్వచ్ఛతా సేవపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దొరస్వామి, సుబ్రమణ్యం, కార్యదర్శి జనార్దన్ పాల్గొన్నారు.

నేడు ఏకొల్లులో ఆధార్ క్యాంపు

దొరవారిసత్రం : మండలంలోని ఏకొల్లు గ్రామ సచివాలయంలో ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సింగయ్య వెల్లడించారు. శుక్రవారం ఉచ్చూరు గ్రామ సచివాలయంలో ఆధార్ క్యాంపు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించుకున్నారని, మరికొందరు మార్పులు, చేర్పులు, కొత్త కార్డులకు దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు.

విద్యార్థులకు యూనిఫామ్ వితరణ


విద్యార్థులకు యూనిఫామ్ అందిస్తున్న సతీష్‌రెడ్డి

గూడూరురూరల్ : మండలంలోని విందూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం ఎన్ఆర్ఐ నల్లవడ్ల సతీష్‌రెడ్డి వితరణగా రెండు జతల యూనిఫామ్ అందించారు. ఆయన మాట్లాడుతూ ఇదే పాఠశాలలో చదువుకున్నానని, ఉపాధ్యాయులు ఉత్తమ భోధన కారణంగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకునే స్థాయికి ఎదిగానని తెలిపారు. సర్పంచ్ మస్తానయ్య ద్వారా ప్రవీణ్‌గురు చొరవతో యూనిఫామ్ అందజేసినట్లు వెల్లడించారు. అనంతరం దాతను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పరిమితి మేరకే ఎరువుల వినియోగం


మాట్లాడుతున్న ఏడీఏ భాస్కరయ్య

వెంకటగిరిరూరల్ : పంటల సాగులో పరిమితి మేరకే ఎరువులు వినియోగించాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని పారవోలులో వరి సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ యూరియాను పంట 25 నుంచి 30 శాతం మాత్రమే తీసుకుంటుందని మిగతా వృథా అవుతుందన్నారు. సీజన్ ప్రకారం అనువైన వరి రకాలు, నారు పెంపకంలో మెలకువలు పాటించాలని సూచించారు. ఆర్‌బీకేల్లో అందించే ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, వేణుగోపాలరావు, వీఏఓ శివ పాల్గొన్నారు.

చాగణంలో 'సురక్ష' సర్వే


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సైదాపురం : మండలంలోని చాగణం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేపట్టారు. వలంటీర్లతో కలిసి వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు జనార్ధన్, శ్రావణి మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులను గుర్తించి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ప్రత్యేక వైద్యశిబిరంలో చికిత్స అందించనున్నట్లు వివరించారు.

అర్హులందరికీ మురి'పింఛెన్'

కులాలు ప్రసక్తి లేదు.. మతాల పట్టింపు లేదు.. పార్టీల ప్రమేయం లేదు.. పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ ప్రభుత్వం పథకాలు అందిస్తోంది. లబ్ధిదారులను వెతికి పట్టుకుని మరీ సంక్షేమ ఫలాలు పంపిణీ చేస్తోంది. ముఖ్యంగా సామాజిక పింఛన్ల విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. అవ్వాతాతలు.. ఒంటరి మహిళలు.. వితంతవులు.. దివ్యాంగులకు అండగా నిలుస్తోంది. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ అర్హత మేరకు నూతన పెన్షన్లు మంజూరు చేస్తోంది. అందులో భాగంగా గూడూరు నియోజకవర్గంలో కొత్తగా 1,636 మందికి లబ్ధి చేకూర్చింది.


కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు (ఫైల్)

- పేదలకు అండగా ప్రభుత్వం
- లబ్ధిదారులను వెతికి మరీ పథకాలు
- గూడూరు నియోజకవర్గంలో కొత్తగా 1,636 మందికి పింఛన్లు

చిల్లకూరు : పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోంది. ఎవరైనా అర్హత ఉండీ పథకం మంజూరు కాకుంటే వారికి న్యాయం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా గూడూరు నియోజకవర్గంలో అర్హులైన 1,636 మందికి కొత్తగా పింఛన్లు పంపిణీ చేసింది. కన్న బిడ్డలు, కుటుంబసభ్యులు పట్టించుకోకపోయినా ప్రభుత్వం తమకు అండగా ఉందనే ధీమాను లబ్ధిదారుల్లో కల్పించింది. ఈ క్రమంలో నూతనంగా రూ.2,750 పింఛన్ అందుకున్న వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల చిల్లకూరు సచివాలయంలో ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు చేతులమీదుగా పింఛన్లు అందుకున్న వారు తమ ఆనందాన్ని అందరితో పంచుకుంటున్నారు. ఇప్పటి వరకు ఎవరూ ఇంతలా పేదలకు సాయం చేయలేదని వెల్లడిస్తున్నారు. సంక్షేమ ప్రదాతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికీ తమ గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడుతున్నారు.

నియోజకవర్గ సమాచారం

మండలం	కొత్తగా పింఛన్ మంజూరైన వారి సంఖ్య
గూడూరు పట్టణం	250
గూడూరు రూరల్	404
చిల్లకూరు	274
చిట్టమూరు	195
వాకాడు	232
కోట	281

ఆరునెలల్లోనే మంజూరు



నా భర్త పాము కాటుతో ఈ ఏడాది ఏప్రిల్‌లో మరణించాడు. వలంటీర్ వచ్చి నా భర్త డెత్ సర్టిఫికెట్ ఇప్పించాడు. అనంతరం వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేయించాడు. నేను ఎక్కడికీ వెళ్లాల్సిన పనిలేకుండా ఆరునెలల్లోనే పింఛన్ మంజూరైంది. ఈ నెల పింఛన్ సొమ్ము అందజేశారు. నా కష్టాలను తీర్చేందుకు ఈ నగదు ఉపయోగపడుతోంది. జగనన్న రుణం ఎన్నటికీ తీర్చుకోలేను.
– ఎల్లంపల్లి అంకమ్మ, వల్లిపేడు, చిల్లకూరు మండలం

వలంటీర్ చొరువతోనే..



నా భర్త మృతి చెంది ఏడాది దాటింది. వలంటీర్ చొరవ తీసుకుని నా భర్త డెత్ సర్టిఫికెట్ ఇప్పించాడమే కాకుండా వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేయించాడు. తానే స్వయంగా వెళ్లి ఆన్‌లైన్ చేయించి పింఛన్ మంజూరు అయ్యేలా చూశాడు. ఈ నెల రూ.2,750 నగదు వచ్చింది. ఈ సొమ్ముతో ధైర్యంగా జీవనం సాగించే అవకాశం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.
– దాసరి రామమ్మ, బల్లవోలు, చిల్లకూరు మండలం

మేలు మరువలేం



కల్లు గీత పనిచేసుకుంటూ పొట్టపోసుకుంటున్నా. ప్రభుత్వం మాకు పింఛన్ ఇస్తోందని తెలిసి వలంటీర్‌ను సంప్రదించా. ఆయన వెంటనే స్పందించాడు. నా ధ్రువీకరణ పత్రాలు తీసుకుని దరఖాస్తు ఆన్‌లైన్ చేయించాడు. నాకు పింఛన్ మంజూరైంది. ఈ నెలలో అధికారులు నాకు పింఛన్ నగదు అందించారు. జగనన్న మేలు ఎన్నటికీ మరువలేం.
– నాశిన సుబ్బయ్య, పల్లెవానిదిబ్బ, చిల్లకూరు మండలం

బాధ్యతాయుతంగా విధుల నిర్వహణ


రిజిస్టర్ పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

సైదాపురం : సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని రామసాగరం సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది విధిగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉంటూ మెరుగైన సేవలందించాలని కోరారు. సచివాలయంలో సంక్షేమ క్యాలెండర్‌ను ప్రదర్శించాలన్నారు. స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం


అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న దృశ్యం

కోట : టీచర్స్ డే సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన వెంకన్నపాళెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రావును శుక్రవారం పలువురు ఘనంగా సత్కరించారు. కోటలోని బెరాకా ఆరాధన మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్, ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రభాకర్‌రావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ మస్తానయ్య, కేవీసీ పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ కార్యదర్శి నోవాబాబు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గంధ మహోత్సవం


దర్గా వద్ద భక్తుల ప్రార్థనలు

తడ: మండలంలోని వేనాడులో వెలసిన హేక్ దావూద్ షావలీ అల్లాహ్ (కరమతుల్లా) 28వ గంధ మహోత్సవం శుక్రవారం అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్గాను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. గంధం కోసం సిద్ధం చేసిన పల్లకినీ శోభాయమానంగా తీర్చిదిద్దారు. ముజావర్ ఆధ్వర్యంలో పల్లకిలో గంధం కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. అర్ధరాత్రి గంధాన్ని దర్గాకు లేపనం చేసి, చద్దర్ కప్పడంతో గంధ మహోత్సవం పరిసమాప్తం అవుతుందని నిర్వాహకులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి 'చెబుదాం'


అర్జీలు స్వీకరిస్తున్న జేసీ బాలాజీ

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి) : ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. శుక్రవారం బాలాయపల్లె తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండలంలో మొత్తం 117 అర్జీలు వస్తే అందులో భూ వివాదాలపైనే 91 ఉన్నాయని వెల్లడించారు. ప్రతి వినతిని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ రవీంద్రబాబు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు


డ్రైనేజీల్లో మందు పిచికారీ చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

నాయుడుపేటటౌన్ : పట్టణంలో దోమల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అన్ని వార్డుల్లోని డ్రైనేజీల్లో ఆయిల్ బాల్స్ వేయడంతోపాటు మందు పిచికారీ చేయిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు మందు పిచికారీ పనులను ఆయన పరిశీలించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు


వాలీబాల్ పోటీలో బాలికలు


కబడ్డీ పోటీలో బాలురు

గూడూరురూరల్ : పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బాలబాలికలు హోరాహోరీగా తలపడ్డారు. పీఈటీ సుబ్రమణ్యం మాట్లాడుతూ పోటీల్లో క్రీడా స్ఫూర్తి అవసరమని, విజేతలను అభినందించాలే కానీ, ఈర్ష్య పడకూడదని సూచించారు. ఇక్కడ ఎంపికైన వారిని జిల్లాస్థాయి పోటీలకు పంపనున్నట్లు వెల్లడించారు.

శివాలయంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

రాపూరు : వినాయక చవితి సందర్భంగా రాపూరు శివాలయంలో ఏర్పాటు చేసిన గణనాథునికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. రాత్రి ఊంజల్‌సేవ, విద్యాగణపతి పూజ జరిపించారు.

పోషకాహారంపై అవగాహన


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ కృష్ణవేణి

వెంకటగిరిరూరల్ : పట్టణంలోని ఎన్జీవో కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు తప్పనిసరిగా పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై తగు శ్రద్ధ వహించాలని కోరారు. సమతుల ఆహారం తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యకరంగా ఉంటారని వివరించారు. రక్తహీనత సమస్యలను సైతం సులువగా అధిగమించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే మహిత, ఏఎన్ఎం చంద్రిక పాల్గొన్నారు.

కండలేరులో 12.3492 టీఎంసీలు

రాపూరు : కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 12.349 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 845 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 25, లోలెవల్ స్లూయిస్‌కు 50క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నట్లు వివరించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం


తీర్థంపాడులో ఇంటి వద్దనే రోగికి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది


వెలికల్లులో రక్తనమూనాల సేకరిస్తున్న వైద్యాధికారులు

- పరిసరాల పరిశుభ్రత ప్రధానం
- జాగ్రత్తలపై అవగాహన అవసరం

దక్కిలి : వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేకుంటే దోమలు వృద్ధి చెంది టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర రోగాలు వ్యాప్తిం చెందే అవకాశముందని వెల్లడిస్తున్నారు. ఈ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పల్లెల్లో ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటిస్తున్నారు. పంచాయతీ, వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుద్ధ్య చర్యలను చేపడుతున్నారు. నిల్వ చేరిన మురుగునీటిని తొలగిస్తున్నారు. పకడ్బందీగా దోమల నివారణ మందులను పిచికారీ చేయిస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నారు. రోగాలతో బాధపడుతున్న వారికి మందులు అందజేస్తున్నారు.

జాగ్రత్తలపై అవగాహన

సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. వేడిగా ఉన్న ఆహారాన్ని భుజించాలని కోరుతున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని చెబుతున్నారు. చేతులను తరచుగా శుభ్రం చేసుకోవాలని వెల్లడిస్తున్నారు. ఇళ్ల కిటికీలకు మెష్ ఏర్పాటు చేసుకోవాలని, దోమ తెరలను వినియోగించాలని వివరిస్తున్నారు.

ఇంటి వద్దకే వైద్యం



వర్షాకాలం నేపథ్యంలో జ్వర పీడితుల సంఖ్య పెరిగే అవకాశముంది. రెండు రోజులకు మించి జ్వరం తగ్గకుండా ఉంటే వెంటనే పీహెచ్‌సీలో సంప్రదించాలి. ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళుతున్నారు. అవసరమైన వారికి వైద్యం అందిస్తున్నారు.
– బిందు ప్రియాంక, వైద్యాధికారి, దక్కిలి

ఘనంగా గణపతి నిమజ్జనోత్సవం


సైదాపురం : ఉట్టి కొడుతున్న యువకులు

నాయుడుపేటటౌన్ : వినాయకచవితి వేడుకల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో ఘనంగా గణపతి విగ్రహాల నిమజ్జనం నిర్వహించారు. స్థానిక ముస్లిం వీధిలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను ఊరేగింపుగా తూపిలిపాళెం బీచ్‌కు తీసుకెళ్లారు. అలాగే పలు ప్రధాన కూడళ్లలో నెలకొల్పిన విగ్రహాలను వివిధ వాహనాల్లో నిమజ్జనానికి తరలించారు. తీన్‌మార్ బ్యాండ్లు, బాణసంచా పేలుళ్లు, యువత కేరింతల నడుమ ఊరేగింపులు ఉత్సాహంగా సాగాయి. రామకృష్ణాపురం వీధిలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్ పాపాడి చంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువత నాయకులు గంధవల్లి భరత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జనోత్సవంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు.


సైదాపురం : వినాయకుడి గ్రామోత్సవం

సైదాపురం : మండలంలోని సైదాపురం, ఊటుకూరు, గిద్దలూరు, మర్లపూడి, చాగణం, కలిచేడు, తలుపూరు, రామసాగరం తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలతో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఎస్ఐ చల్లా వాసు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. యువత ఉత్సాహంగా ఉట్టి మహోత్సవం చేపట్టారు. తూపిలిపాళెం, కైవల్యానదిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.


చిన్నారులకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు


యువత కేరింతల నడుమ నిమజ్జనానికి తరలుతున్న గణేశుడు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాపూరు : మండలంలోని రాపూరు, వేపినాపి, శానాయిపాళెం గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కార్తీక్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోనలో తలనీలాల వేలం

రాపూరు : పెంచలకోనలో శుక్రవారం తలనీలాల వేలం పాట నిర్వహించినట్లు ఈఓ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. తలనీలాలు పోగు చేసుకునే కాంట్రాక్టును రూ.1,55,00,700లకు వేలంలో అప్పగించినట్లు వెల్లడించారు.అలాగే భూముల వేలం పాటను వాయిదా వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి,పెంచలయ్యస్వామి పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

దొరవారిసత్రం : గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం బైక్ ఢీకొని ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. తడ మండలం పెద్దమాంబట్టుకు చెందిన చిన్నయ్య అనే వృద్ధుడు దొరవారిసత్రానికి వచ్చి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా చెన్నై వైపు నుంచి వస్తున్న బైక్ ఢీకొంది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.